బాధిత కుటుంబాలకు పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఏప్రిల్ 9: రోడ్డు ప్రమాదంలో, అనారోగ్యంతో మృతి చెందిన వారి ఇండ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని వారిని ఓదార్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఆత్మ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అలీ, కల్హేర్ ఎంపీటీసీ సంగప్ప, నాయకులు పెర్మండ్ల బాలయ్య, శ్రీనివాస్‌గౌడ్, సాయిలు, నర్సింహగౌడ్, సాయిగొండ, బాలయ్య, పండరి, నాందేవ్, రాజు ఉన్నారు.

బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం

జోగిపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ మేనేజర్ ఉపేందర్

అందోల్, ఏప్రిల్ 9: భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి జోగిపేట వారి ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు చల్లని మినరల్ వాటర్, మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏండ్లుగా ప్రజల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారని, వారి సేవలు మున్ముందు ఇలాగే కొనసాగాలన్నారు. రెండు నెలలపాటు చలివేంద్రంలో మినరల్ వాటర్, మజ్జిగ, అంబలి అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు సదాశివగౌడ్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సాగేదెలా.. తాగేదెలా?

- రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలాలు
- 1.21 మీటర్లు దిగువకు నీటిమట్టాలు
- ఆగిఆగి పోస్తున్న బోరుబావులు
- సాగు నీరందక ఎండుతున్న పంటపొలాలు
- నాగల్‌గిద్ద, కంగ్టి ప్రాంతంలో తాగునీటి కష్టాలు

నాగల్‌గిద్ద మండలం ఖుబా తండాల్లో ట్యాంకర్ వద్ద గుమిగూడిన తండావాసులు

సంగారెడ్డి, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): జిల్లాలో భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. వర్షాభావానికి తోడు భూగర్భ జలాల వాడకం పెరుగుతుండడంతో గంగమ్మ లోలోతుల్లోకి వెళ్లిపోయింది. ఫలితంగా బోరుబావులు నీరు పోయడంలేదు. పంటపొలాలు ఎండిపోతున్నాయి. సాగునీటి కష్టాలకు తోడు జిల్లాలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి.

పాతాళంలోకి గంగమ్మ

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్‌గిద్ద, కంగ్టి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. సాగు, తాగునీటి కష్టాలకు తోడు కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. అప్రకటిత కరెంటు కోతలపై రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 12.45 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. గత నెలతో పోలిస్తే జిల్లాలో 1.21 మీటర్ల మేర భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. ఫిబ్రవరిలో భూగర్భ జలమట్టాలు 11.24 మీటర్లు ఉండగా, మార్చి నెలాఖరులో 12.45 మీటర్లకు పడిపోయాయి. ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో 1.21 మీటర్ల మేర భూగర్భ జలాలు పడిపోయాయి. ఏప్రిల్‌లో మరింత ఎక్కువస్థాయిలో తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నాయి. భూగర్భ జలమట్టాలు 15 మీటర్ల దిగువకు చేరుకుంటే అది క్రిటికల్ దశగా చెబుతారు. 15 మీటర్ల కంటే ఇంకా దిగువకు భూగర్భ జలాలు చేరుకుంటే నీటి కష్టాలు మరింత ఎక్కువ అవుతాయి. అదే జరిగితే బోరుబావుల కింద సాగునీరు అందక పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. బోరుబావుల్లోనూ నీడు అడుగంటి నీటి కష్టాలు పెరిగే అవకాశాలున్నాయి.

హత్నూరలో 20 మీటర్ల లోతులో..

జిల్లాలో హత్నూర మండలంలో అత్యధికంగా 20.76 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. కొండాపూర్ మండలంలో 19.60 మీటర్లు, సంగారెడ్డిలో 18.19, నిజాంపేటలో17.60, కల్హేర్‌లో 17.48, కంగ్టిలో 17.28, పటాన్‌చెరులో 16.15, చౌటకూరు మండలంలో 15.31 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి. గుమ్మడిదల మండలంలో 14.84 మీటర్లు, రామచంద్రాపురం మండలంలో 13.56, కందిలో 13.27, జహీరాబాద్‌లో 13.26, సిర్గాపూర్‌లో 11.73, సదాశివపేటలో 11.39, జిన్నారంలో 11.25 మీటర్లకు భూగర్భ జలమట్టాలు చేరుకున్నాయి. నారాయణఖేడ్, అందోల్, ఝరాసంగం, మొగుడంపల్లి, న్యాల్‌కల్, పుల్కల్, రాయికోడ్ మండలాల్లో 5 నుంచి 10 మీటర్లకు భూగర్భ జలమట్టాలు చేరుకున్నాయి. అమీన్‌పూర్ మండలంలో 2.47 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి.

రైతులకు మొదలైన సాగునీటి కష్టాలు

భూగర్భ జలాలు పడిపోతుండటంతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పడిపోవడంతో బోరుబావులు నీళ్లు తక్కువగా పోస్తున్నాయి. దీంతో బోరుబావుల కింద పంటపొలాలు సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 12.45 మీటర్లకు భూగర్భజలాలు చేరుకున్నాయి. భూగర్భ జల శాఖ అధికారుల సమాచారం మేరకు సంగారెడ్డి జిల్లాలో మొత్తం లక్షకుపైగా బోరుబావులు ఉన్నాయి. ఇందులో 50వేలకుపైగా వ్యవసాయ బోరు బావులు ఉన్నాయి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు బోరుబావుల కింద వరి పంటను ఎక్కువగా సాగు చేశారు. అయితే భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో బోరుబావులు సరిగ్గా నీళ్లుపోడంలేదు. దీంతో సాగునీరు అందక వరి ఇతర పంటలు ఎండిపోతున్నాయి. అప్రకటిత కరెంటు కోతలు అమలవుతుండటంతో పంటలకు సకాలంలో సాగునీరు అందక పంటలు ఎండియే పరిస్థితులు నెలకొన్నాయి.

తాగునీటికి తండ్లాట

వేసవికితోడు భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతుండటంతో జిల్లాలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. బోరు బావులు నీరు పోయడం లేదు. దీనికితోడు కొన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా సరఫరా కావడంలేదు. దీంతో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి, నాగల్‌గిద్ద మండలాల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. నాగల్‌గిద్ద మండలంలోని కరస్‌గుత్తి, ఇరక్‌పల్లి, ఔదత్‌పూర్‌తోపాటు పలు తండాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని బోరుబావుల నుంచి నీరు రాక, మిషన్‌భగీరథ నీరు ప్రతిరోజు సరఫరా కాకపోవటంతో ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొవాల్సి వస్తోంది. తాగు నీటి కొరత ప్రారంభమైనందున జిల్లా యంత్రాంగం అప్రమత్తమై తాగునీటి కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

మంగంపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 9: మండలంలోని ఊట్ల, మంగంపేట, దాదిగూడెం గ్రామాల్లో బీజేపీ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా నిర్వహించిన ప్రచారానికి బీజేపీ జిల్లా నాయకులు కె.నర్సింగ్‌రావు, వి.ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్, మద్దూరి రాజు, రాజభార్గవ్, నరేందర్, రవి, నర్సింహులు, శంకర్, ప్రదీప్‌యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జడ్పీటీసీ

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 9: బీజేపీతోనే ప్రజా రంజక పాలన సాధ్యం అని జడ్పీటీసీ రాజు రాథోడ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, స్థానిక నాయకులు సంగప్ప, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

హుస్సేల్లి చెక్‌పోస్టు వద్ద నగదు పట్టివేత

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 9: మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులోని అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మంగళవారం రూ.75 వేల నగదును పోలీసులు పట్టుకున్నారు. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం ప్రకారం.. బీదర్-జహీరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా కర్ణాటకలోని బీదర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వాహనంలో రూ.75వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో చెక్‌పోస్టు పోలీసులు నగదును సీజ్ చేశారు.

ఆర్సీపురం ఈద్గాలో ఇఫ్తార్

ఇఫ్తార్ విందులో కరికె సత్యనారాయణ

రామచంద్రాపురం, ఏప్రిల్ 9: ఆర్సీపురం డివిజన్‌లోని ఈద్గాలో బీసీ సంఘం జిల్లా నాయకుడు కరికె సత్యనారాయణ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఇందులో భాగంగా ముందుగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇఫ్తార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందు, ముస్లింల ఐక్యతకు నిదర్శనం ఇఫ్తార్ అని పేర్కొన్నారు. నెలపాటు ముస్లింలు ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలు ఆచరించి రంజాన్ జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, శ్రీనివాస్‌గౌడ్, అబ్దుల్ ఘని, గఫర్, ఖదీర్, అబీబ్, కృష్ణగౌడ్, అన్వర్ ఉన్నారు.

రోడ్లపైనే వ్యర్థాలు.. తప్పని కష్టాలు

జోగిపేట హన్‌మాన్ మందిర్ సమీపంలో రోడ్డుపై తగులబెడుతున్న వ్యర్థాలు

అందోల్, ఏప్రిల్ 9: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో రోడ్లపై, రోడ్లకు ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పారబోస్తుండడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల రోడ్లపై వేసిన చెత్త, ఇతర వ్యర్థాలను ఇష్టానుసారంగా తగులబెడుతున్నారు. దీంతో పక్కన ఉండే నివాసగృహాల్లోకి పొగ చేరడంతోపాటు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాత సామగ్రి కొనే దుకాణాల వద్ద ప్లాస్టిక్, టైర్లను తగులబెడుతుండడంతో దట్టమైన పొగలు వ్యాపిస్తున్నాయి. పారిశుధ్యం లోపిస్తున్నదని, అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పట్టణంలోని ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం, వేసిన చెత్తను తగులబెట్టడంతో ఆయా కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దీనికితోడు డ్రైనేజీలను సైతం శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తున్నదని, మున్సిపల్ అధికారులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

రామచంద్రాపురం, ఏప్రిల్ 9: పేకాట స్థావరంపై ఆర్సీపురం పోలీసులు రైడ్ చేసి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శశికాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్సీపురం డివిజన్‌లోని అశోక్ నగర్‌లోని సెవన్‌హిల్స్ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయమైన సమాచారం రావడంతో పోలీసులు రైడ్ చేశారు. పోలీసుల రైడ్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.64,690 నగదు, రెండు సెట్‌ల పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై శశికాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

గండిగూడెం రోడ్డుపై ద్విచక్ర వాహనాలు తనిఖీ చేస్తున్న బొల్లారం పోలీసులు

బొల్లారం, ఏప్రిల్ 9: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని గండిగూడెం రహదారిపై మంగళవారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్సీ రూపేశ్ ఆదేశాల మేరకు, సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. వాహన తనిఖీల్లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి చాలాన్లు విధించారు. ఎన్నికల వేళ సరైన పత్రాలతో రోడ్డుపైకి రావాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ యాత్ర

ఒడిశా, బీహార్ మహిళలతో కలిసి కలశ యాత్రలో పాల్గొన్న కౌన్సిలర్ చంద్రారెడ్డి

బొల్లారం, ఏప్రిల్ 9: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఒడిశా, బీహార్ రాష్ట్రాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో కలశ యాత్ర నిర్వహించారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కలశ యాత్రలో మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలశ యాత్ర అనంతరం స్థానిక దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు తొమ్మిది రోజులపాటు మహిళలు దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తలపై కలశాలను ధరించి మహిళలు దుర్గామాతకు మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పాల్గొన్న కౌన్సిలర్ చంద్రారెడ్డిని మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రత్యూష రెడ్డి, రాజ్ గోపాల్, దీనానాథ్, శ్రీమన్నారాయణ, రాజారామ్, జైజై సింగ్, ప్రవీణ్‌రెడ్డి, మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు దుర్గావతి, పరంశీల, గీతాదేవి పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 9: స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఎస్‌బీఆర్ఎస్ఈటీఐ)లో గ్రామీణ పురుషులకు ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్‌లో నెలపాటు ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు ఎస్‌బీఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ తెలిపారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 18 ఏండ్లకు పైబడిన పురుషులకు భోజన వసతి, యూనిఫాం ఇచ్చి శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తోపాటు టూల్ కిట్ ఉచితంగా ఇస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పదో తరగతి మెమో జిరాక్స్, 4 ఫొటోలతో ఈ నెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి చదవని వారు కూడా శిక్షన పొందవచ్చని తెలిపారు. వివరాలకు 94901 03390, 94901 29839 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

3 కిలోల ఎండు గంజాయి పట్టివేత

నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు

హత్నూర, ఏప్రిల్ 9: హత్నూర మండల పరిధిలోని కొత్తగూడెం, చింతలచెరువు గ్రామాల్లో ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి మూడు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఎస్ నవీన్‌చంద్ర, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మానెమ్మ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్ పేట, హత్నూర మండలం చింతల్ చెరువు, కొత్తగూడెం గ్రామాల్లోని పలు ఇళ్లపై దాడిచేసి మూడు కేజీల ఎండు గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన ప్రతిమ జానీ, చింతలచెరువు, కొత్తగూడెం గ్రామాలకు చెందిన భాను, సాగర్, చందు, సాయి, శివ, ఉదయ్, కళ్లెం శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకోగా చాపల శ్రీకాంత్, వివేక్ గౌడ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఎస్సైలు హనుమంతు, అనుదీప్, దిలీప్ కుమార్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

ఘనంగా నరేంద్ర మహారాజ్ పాదుక దర్శనం

బసదప్రదీప ఫంక్షన్‌హాల్‌లో పాదుక దర్శన కార్యక్రమానికి హాజరైన భక్తులు

కంగ్టి, ఏప్రిల్ 9: మండల కేంద్రమైన కంగ్టిలో నిర్వహించిన శ్రీనరేంద్ర మహారాజ్ పాదుక దర్శనం ఘనంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలనుంచి భక్తులు వేలాదిగా తరిలి వచ్చి స్వామివారి పాదుకలను దర్శించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున స్థానిక గణేశ్ మందిరం నుంచి బసవప్రదీప ఫంక్షన్ హాల్ వరకు పాదుకలను ఊరేగించారు. నరేంద్ర మహారాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10 మంది పేద, సన్నకారు రైతులకు ఉచితంగా స్ప్రే పంప్‌లను స్థానిక ఎస్సై విశ్వజన్ చేతుల మీదుగా వారికి అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఊరూరా ఉగాది సంబురాలు

క్రోధి నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఊరూరా అంబరాన్నంటాయి. జిల్లా ప్రజలు పొద్దుపొడవకముందే నిద్రలేచి తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి తమ ఇష్టదైవాలను దర్శించుకున్నారు. ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలతో అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దారు. షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సేవించి ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇండ్లలో నోరూరించే పండి పంటలు తయారు చేసుకున్నారు. ఉగాదిని పురస్కరించుకొని పలు గ్రామాల్లో రైతులు పొలాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణాలను శ్రద్ధతో విన్నారు. అదాయ వ్యయాలు, రాశులు, భవిష్యత్ కార్యచరణ తదితర అంశాలపై వేద పండితులు, పురోహితులు చదివి వినిపించారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 9



బొల్లారం: హనుమాన్ ఆలయంలో పంచాంగ పఠనం నిర్వహిస్తున్న పురోహితులు

రామచంద్రాపురం: పంచాంగ శ్రవణం వింటున్న కార్పొరేటర్ పుష్పానగేశ్



జిన్నారం: పంచాంగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు

రాయికోడ్: వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

న్యాల్‌కల్: రేజింతల్ సిద్ధి వినాయక ఆలయంలో..

కోహీర్: రాచన్నస్వామి ఆలయంలో..

వట్‌పల్లి: ఖాదిరాబాద్‌లో..

కొండాపూర్: తొగర్‌పల్లిలో..

అమీన్‌పూర్: పంచాగ శ్రావణంలో ప్రజలు

నారాయణఖేడ్: ఉగాది పచ్చడి పంపిణీ

కంగ్టి: కంగ్టిలో పంచాంగ శ్రవణం

అందోల్: జోగినాథస్వామి ఆలయం వద్ద..

గుమ్మడిదలలో..